B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 246 | మంగళవారం | 22-09-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



దానం పిటిషన్ విచారించనున్న సుప్రీంకోర్టు

- దానం నాగేందర్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు
- పార్టీ ఫిరాయింపుల కేసులో దానంను అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు 2
- హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన దానం
- దానం పిటిషన్ ను బుధవారం విచారించనున్న సుప్రీంకోర్టు

మన ప్రజాపక్షం,హైదరాబాద్


ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది.భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్

ప్రతి గ్రామపంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దాలి: మంత్రి సీతక్క 2

ఎల్3 కేటగిరీలో ఉన్న వారికి గుడ్‌న్యూస్

ఇప్పటికే నిర్మాణం ప్రారంభిస్తే నిధుల మంజూరుకు ఆదేశం

ఎల్3 కేటగిరీ ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఎల్3లో ఉన్నప్పటికీ ఇల్లు నిర్మాణం ప్రారంభిస్తే ప్రత్యేక అనుమతి ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు.



మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఎల్3 కేటగిరీ ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్షేత్ర స్థాయి సర్వేలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల విచారణలో అనర్హులుగా తేలిన వారిని అధికారులు ఎల్3 కేటగిరిలో పెట్టారు. కానీ ఒకవేళ వారు ఎల్3లో ఉన్నప్పటికీ ఇల్లు నిర్మాణం ప్రారంభిస్తే ప్రత్యేక అనుమతి ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. బేస్‌మెంట్ పూర్తయి ఎల్3లో ఉంటే ఆ ఇళ్లకు ఈ పథకం కింద నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఇళ్లు మంజూరై నిర్మాణం ప్రారంభం కాని అనర్హులకు రద్దు చేస్తామని ఆయన చెప్పారు. ఎల్3 కేటగిరీలో అనర్హులకు రద్దు చేసి అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ని
ఆదేశించారు. క్యూర్(హైదరాబాద్) పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు వచ్చేవరకు ఈ పథకం విడతల వారీగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పేదలు అయితే చాలని, ఏ పార్టీ వారు అని చూడకుండా ఇల్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఎకరా రూ.260 కోట్లు పలికే రాయదుర్గం ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ ను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రద్దీ ఉండే ప్రాంతాల్లో, చాలా ఖరీదైన ప్రాంతాల్లో టవర్స్ నిర్మించి ఇళ్లు ఇస్తున్నామన్న ఆయన బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోలేదని విమర్శించారు.

రాజకీయ జోక్యం, పైరవీలకు తావులేదు

ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, పైరవీలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు. లాటరీ విధానంలో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని, ఎవరి సిఫార్సులు, ఒత్తిళ్లకు లొంగకుండా అర్హత ఆధారంగా ఎంపిక జరుగుతోందని అన్నారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు కూడా క్యూర్ ప్రాంతంలో లాటరీ ఎంపికలను బహిరంగంగా ప్రకటించి, అభ్యంతరాలు స్వీకరించే విధానాన్ని అమలు చేస్తోందని గుర్తుచేశారు.ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, వచ్చే



కేసీఆర్ చారిత్రక నిర్లక్ష్యంతోనే నీటి ఎద్దడి

- కేసీఆర్ హయాంలో ఆంధ్ర ప్రాజెక్టులకు మేలు చేశారన్న జూపల్లి
- వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపాటు 2
- జూరాల వద్ద రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్ల 5.50 లక్షల ఎకరాలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన

మన ప్రజాపక్షం,హైదరాబాద్

గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యపూరిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో నీటి నిల్వలు తగ్గి రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేవలం 30 శాతానికే పరిమితం చేసి ఆంధ్రా ప్రాజెక్టులకు లబ్ధి చేకూర్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పోరాడి ఆ వాటాను 43 శాతానికి

రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

- ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్ చేశారన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం
- బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారని ఆరోపణ 2
- సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ
- అరెస్ట్ చేసిన వారిని విడుదల చేసి, నీళ్లు ఇవ్వాలని డిమాండ్



మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని

రైతులకు నీళ్లివ్వరా?

ఎండాకాలం బూచి చూపి రైతులకు నీళ్లివ్వరా?
:కాంగ్రెస్ సర్కార్‌పై డీకే అరుణ ధ్వజం
జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే నీటిని విడుదల చేయాలన్న డీకే అరుణ
జలాశయంలో ప్రస్తుతం సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడి
రైతులు చేపట్టిన ఆందోళనలకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టీకరణ



కొనసాగుతున్న భూసర్వే..

కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

- రంగంలోకి రెవెన్యూ అధికారులు
- ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి
- మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన
- శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన
- ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు



మన ప్రజాపక్షం,సిద్దిపేట

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి



హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం: మంత్రి శ్రీధర్ బాబు

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

కేసీఆర్ కుటుంబ ఆస్తులపై కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు
ధర్మసాగర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం
ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్న కడియం శ్రీహరి
కల్వకుంట్ల కుటుంబానికి వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్న

మన ప్రజాపక్షం,హనుమకొండ

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘనంగా ప్రారంభించారు. నూతనంగా ఎన్నికైన మండల



వికృత చేష్టలకు పాల్పడుతున్నారు

- 'సర్' ప్రక్రియ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారు: సీపీఐ నారాయణ
- సర్ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారన్న నారాయణ
- అద్వానీ, జైశంకర్ వంటి ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేశారని విమర్శ
- వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడాన్ని కూడా పెద్ద సమస్యగా చూపుతున్నారని మండిపాటు 2





పౌరసత్వం కేసులో దర్యాప్తునకు ఆదేశాలు

- సోనియా గాంధీకి బిల్లీ కోర్టు షాక్
- పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే ఎన్నికల జాబితాలో సోనియా పేరు ఉందని ఆరోపణలు
- దీనిపై దర్యాప్తును తిరస్కరిస్తూ గతంలో మేజిస్ట్రియల్ కోర్టు ఆదేశాలు
- తాజాగా కొట్టివేస్తూ ఆదేశాలు

2

కేసీఆర్ చారిత్రక నిర్లక్ష్యంతోనే
నీటి ఎద్దడి

మొదటి పేజీ తరువాయి

పెంచుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే పాలమూరు తీవ్రంగా నష్టపోయిందన్నారు.రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ పాలమూరు జిల్లాలో రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. గట్టు వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ కడతానని చెప్పిన కేసీఆర్ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. జూరాల వద్ద అదనపు రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్లే ఈనాడు 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.తమ ప్రభుత్వం ఈ నీటి ఎద్దడిని నివారించేందుకు 15 టీఎంసీల గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి జీవో జారీ చేయడమే కాకుండా, రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూ సరఫరా వ్యవస్థను కాపాడుతోందని వెల్లడించారు. ఎల్ నినో కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల నిధులు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావడంలో విఫలమైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు కేవలం శవాలపై పేలాలు ఏరుకునే రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

దానం పిటిషన్ విచారించనున్న సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి

సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం (సెప్టెంబర్ 23) విచారించనున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. హైకోర్టు తీర్పు వల్ల ఖైరతాబాద్ స్థానం ఖాళీగా మారి ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున, హైకోర్టు ఉత్తర్వులపై వెంటనే స్టే విధించాలని దానం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించనున్నారు.గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించిన దానం నాగేందర్... ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ తరఫున పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన పాత ఆదేశాలను పక్కనపెట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించడంతో ఈ వివాదం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కింది.

ఎల్3 కేటగిరీలో
ఉన్నే వారికి గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి

బోనాల నాటికి ఇక్కడి నుంచే లబ్ధిదారులతో బోనాలు ఎత్తించే విధంగా నిర్మాణాలను వేగవంతం చేస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, లబ్ధిదారులు తమ ఇల్లు ఎలా కడుతున్నారో చూసుకోవచ్చని, వారానికి ఒకసారి వచ్చి నిర్మాణ పనులను పరిశీలించాలని కోరారు. నాణ్యతలో లోపం కనిపిస్తే అక్కడే ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఆ సమస్యను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.
డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం
ఎకరా రూ.260 కోట్లు పలికే రాయదుర్గం ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. పేద ప్రజలకు అండగా ఉండే ప్రభుత్వమని, అందుకే ఎకరా రూ.260 కోట్ల విలువైన కూడా స్థలం కేటాయించినట్లు చెప్పారు. ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. క్యూర్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్స్ నిర్మించి తిరుతామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు, ముడు, నాల్గవ విడత కింద ఇళ్లు మంజురు చేస్తామని స్పష్టం చేశారు.
బీఆర్ఎస్‌కు మళ్లీ 2023 ఫలితాలే
అధికారం పోయాక బీఆర్ఎస్ నేతలు పేదల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్ల పాటు పేదలను అంటరానివారుగా చూశారని ధ్వజమెత్తారు. ఈ ప్రజాప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇస్తుంటే వారు ఓర్వలేకపోతున్నారని ఘాటుగా స్పందించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వస్తాయని జోస్యం చెప్పారు. వచ్చే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం ప్రారంభవుతుందని తెలిపారు.హైదరాబాద్ రాయదుర్గంలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. రాయదుర్గం మల్కం చెరువు వెనుక 2.85 ఎకరాల స్థలంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ శంకుస్థాపనలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్ ఇతరులు పాల్గొన్నారు.

రైతులకు నీళ్లివ్వమంటే
అరెస్టులా?

మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాల్సింది పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు.జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న భూసర్వే..

మొదటి పేజీ తరువాయి

ప్రారంభమైంది.సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు.అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు.సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు.ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

రైతులకు నీళ్లివ్వరా?

మొదటి పేజీ తరువాయి

పాలమూరు జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోయి నీటి కోసం రైతాంగం అల్లాడుతుంటే, రాబోయే ఎండాకాలాన్ని బూచిగా చూపి కాలువలకు నీటిని నిలిపివేయడం ఏమాత్రం సమంజసం కాదని మండిపడ్డారు. జూరాల జలాశయంలో ప్రస్తుతం సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని, కృష్ణా నదికి ఇంకా వరద వచ్చే అవకాశం కూడా ఉందని స్పష్టం చేశారు.ఒకవేళ వేసవిలో తాగునీటి ఎద్దడి వచ్చినా, ఎగువన కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి అక్కడి నుంచి నీటిని తెప్పించుకునేందుకు చొరవ చూపవచ్చని డీకే అరుణ సూచించారు. జూరాల డ్యాం రోడ్డు, కలెక్టరేట్ ఎదుట రైతులు చేపట్టిన ఆందోళనలకు బీజేపీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని, రైతుల పోరాటానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. నీటి కొరత తీవ్రతను వివరిస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. సాగు చేసిన పంటలు చేతికందేలా కాలువలకు నీరు విడుదల చేయాలని కోరడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటిని రైతులు కూడా పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు.

హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం : మంత్రి శ్రీధర్ బాబు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ : హెల్త్ ఇన్నోవేషన్స్‌కు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో 'హోమా జవీజు 2026' జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ది న్యూ పారాడైమ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు.
50 మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్..
ప్రపంచంలోనే తొలి ఉచిత మెటబాలిక్ కాలిక్యులేటర్ యాప్ 'మెట్రిక్ ఎక్స్‌ప్లోరర్'ను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి 50 మంది రోగులకు ఉచిత ప్రొటోకాల్ అందిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్' కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, స్టార్టప్‌లను హెల్త్‌కేర్‌తో అనుసంధానం చేస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లో సమగ్ర హెల్త్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధి చేస్తున్నామని చెప్పుకొచ్చారు.ఎప్రాథమిక దశలోనే గుర్తించాలని సూచించారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

కమిటీ ప్రతినిధులను శాలువాలతో సన్మానించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ప్రజాక్షేత్రంలో ఉంటూ రేవంత్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యేలా పట్టుదలతో పనిచేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. 'కొత్త, పాత' వ్యత్యాసాలు వీడి, కేవలం పార్టీ పేరు చెప్పుకుని తిరిగే సంస్కృతికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు.ఇదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గడిచిన 12 ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క జాతీయ సంస్థనుగానీ, రూ.1000 కోట్ల ప్రాజెక్టునుగానీ మంజూరు చేయకుండా కుల, మత రాజకీయాలతో చిచ్చు పెడుతోందని ఆరోపించారు.మరోవైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటూ, 2014 ఎన్నికల అఫిడవిట్‌లో ఒక్క ఎకరం భూమి కూడా లేదని చూపించిన కల్వకుంట్ల కుటుంబానికి పదేళ్ల పాలన తర్వాత నేడు వందల ఎకరాలు, ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. 2014కి ముందు ఉన్న ఆస్తులు, ప్రస్తుతం ఉన్న సంపదపై తెలంగాణ ప్రజలకు కేసీఆర్ కుటుంబం సమాధానం చెప్పాలని కడియం శ్రీహరి సవాల్ విసిరారు.

వికృత చేష్టలకు పాల్పడుతున్నారు

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్) పేరుతో చేపడుతున్న వింత, వికృత చర్యలు ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడేలా లేవని, విజ్ఞతలేని తీరుతో ఓటర్లను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ ఘాటుగా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న వైఖరి 'ఎద్దు ఈనిందంటే దూడను గాట్లో కట్టేయమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు.ఓటర్ల వివరాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు, తప్పులు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో సరిదిద్దాలే తప్ప, దేశ మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ, ప్రస్తుత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి అత్యున్నత ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేయడం ఏ రకమైన ప్రక్షాళన అని ఆయన నిలదీశారు.పేర్లలో చిన్నపాటి స్పెల్లింగ్ పొరపాట్లు, వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడం వంటి అత్యంత సహజమైన అంశాలను కూడా పెద్ద సమస్యలుగా చిత్రీకరించడం, తాతముత్తాతల పుట్టిన తేదీలను వెతకాలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం విడ్డూరంగా ఉందని నారాయణ మండిపడ్డారు. దేశంలో ఉన్న కోట్లాది మంది ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, రాజ్యాంగబద్ధమైన నిష్పక్షపాతంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయం నడిపించే ఒక 'సురభి నాటకం'లో స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ అపవిత్రమైన పావుగా మారకూడదని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

పౌరసత్వం కేసులో
దర్యాప్తునకు ఆదేశాలు


మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి దిల్లీ కోర్టు షాక్ ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందేందుకు మూడేళ్ల ముందే సోనియా గాంధీ పేరును ఓటర్ల జాబితాలో చేర్చారన్న ఆరోపణపై విచారణకు నిరాకరిస్తూ గతంలో మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌ను అనుమతించింది. ఈ పిటిషన్‌ను తిరిగి విచారణ చేపట్టాలంటూ దిల్లీ కోర్టు సోమవారం ఆదేశించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వును సరైన వివరణ లేనిదిగా పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దానిని కొట్టివేశారు. రౌస్ అవెన్యూ కోర్టుల సెంట్రల్ దిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అడ్వకేట్ వికాస్ త్రిపాఠి ఈ పిటిషన్ ను దాఖలు చేశారు."భారతీయ నాగరిక్ సురక్షా సంహిత లోని సెక్షన్ 175(3)ను పాటించకపోవడం, ముఖ్యంగా సంబంధిత పోలీస్ అధికారి వాదనలు వినకపోవడం, సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి స్టేటస్ రిపోర్ట్ తెప్పించకపోవడం వంటి కారణాల వల్ల సదరు ఉత్తర్వులో చట్టపరంగా స్పష్టమైన లోపం ఉంది. చట్టం ప్రకారం ఉన్న రెండు మార్గాలను అంటే ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా ప్రత్యామ్నాయంగా బీఎన్ఎస్ఎస్ కింద విచారణ జరపడం వంటి అంశాలను మేజిస్ట్రేట్ పరిగణనలోకి తీసుకోనందున ఆ ఉత్తర్వులో ఎటువంటి వివరణా లేదని స్పష్టమవుతోంది." అని న్యాయమూర్తి అన్నారు.
'ఆ చట్టపరమైన ప్రత్యామ్నాయాలను మెజిస్ట్రేట్ పరిశీలించలేదు'
ఫిర్యాదులో గుర్తించదగిన నేరం జరిగినట్లు వెల్లడైందా లేదా అనే ప్రధాన అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే మేజిస్ట్రేట్ పౌరసత్వం అనే అంశం వైపు మళ్లారని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా దీనిలా కింద ప్రాసీడింగ్స్ నిర్వహించడం అనే చట్టపరమైన ప్రత్యామ్నాయాలను మెజిస్ట్రేట్ పరిశీలించలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తాజా వాదనలు విన్న న్యాయస్థానం కారణాలతో కూడిన ఉత్తర్వు జారీ చేయాలని మేజిస్ట్రేట్‌కు తిరిగి పంపింది. ఈ కేసు తదుపరి విచారణ కోసం సెప్టెంబర్ 29కి వాయిదా వేశారు. ఈ తీర్పును దిల్లీ కోర్టు తాజాగా పక్కనబెట్టడంతో దర్యాప్తునకు మార్గం సుగమం అయ్యింది.
అసలు ఈ కేసు ఏంటంటే?
కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 1983లో భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ దిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గతంలో బీజేపీ నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియా పేరును చేర్చారని అందులో పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని చెప్పారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో మళ్లీ కనిపించిందని రాసుకొచ్చారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని ఆరోపించారు. రాజీవ్‌ను వివాహమాడిన తర్వాత పౌరసత్వం రావడానికి 15 ఏళ్లు ఎందుకు పట్టిందని ఇక్కడ ప్రశ్నించడం లేదు. ముందే ఓటర్ జాబితాలో ఆమె పేరు కనిపించడం ఎన్నికల ప్రక్రియ దుర్వినియోగం కాకపోతే ఇంకేంటి?" అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది.

ప్రతి గ్రామపంచాయతీని మోడల్‌గా
తీర్చిదిద్దాలి: మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ : ప్రతి గ్రామపంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దాలని తెలంగాణ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో మంత్రి సీతక్క సోమవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2వ తేదీన గ్రామసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది చేపట్టాల్సిన పనుల ప్రణాళికపై సమీక్షించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో తీవ్రత అందరికీ తెలుసునని.. ఈ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.
రూ.50 లక్షల పనులు చేపట్టేలా ప్రణాళిక చేస్తున్నాం..
అక్టోబర్ 2వ తేదీన గ్రామసభలు నిర్వహించి యాక్షన్ ప్లాన్‌పై తీర్మానాలను ప్రవేశపెట్టాలని మంత్రి సీతక్క మార్గనిర్దేశం చేశారు. ఆయా గ్రామాల వారీగా అవసరాలు, నిధుల ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యం క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది పంచాయతీలకు వచ్చే అన్ని నిధులపై గ్రామసభల్లో చర్చించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద రూ.6,700 కోట్లను ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో సగటున రూ.50 లక్షల పనులు చేపట్టేలా ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. ఉపాధి హామీ పనులు అడిగిన వారందరికీ కల్పించాలని సూచించారు.
ఉపాధితో పాటు సామాజిక ఆస్తుల కల్పనపై దృష్టి సారించాలి..
ఉపాధితో పాటు సామాజిక ఆస్తుల కల్పనపై దృష్టి సారించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జలసిరి కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి అధికారులకు జిల్లాల వారీగా మానిటరింగ్ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. రెండు రోజుల పాటు జిల్లాల్లో అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని సూచించారు. ఈ సమావేశాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలో పర్యటించాలని మంత్రి సీతక్క ఆదేశించారు



పొదలకూరులో పోలీసుల స్పెషల్ డ్రైవ్

హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన

పొదలకూరు, మన ప్రజాపక్షం:
పొదలకూరు పట్టణంలోని రాంనగర్ గేట్ సెంటర్‌లో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు పోలీసులు హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గుత్తి వెంకటేశ్వర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ శివ రాకేష్ లు పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై స్పష్టమైన సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో జరిగే రోడ్డు ప్రమాదాల తీవ్రత, ప్రాణనష్టం గురించి వివరించారు. అలాగే మద్యం మత్తులో వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్) వల్ల కలిగే తీవ్ర నష్టాలను, చట్టపరమైన చర్యలను ప్రజలకు స్పష్టంగా అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని, వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలను రక్షించుకోవాలని ఈ సందర్భంగా పోలీసులు కోరారు.

భార్య సర్పంచుల స్థానంలో భర్తలు వద్దు

గ్రామాలపై సర్పంచులు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి



ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

పదర,మన ప్రజాపక్షం:
గ్రామ పంచాయతీల్లో భార్య సర్పంచుల స్థానంలో వారి భర్తలు పెత్తనం చేయడం సరికాదని, ప్రజలు ఎన్నుకున్న సర్పంచులే గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచించారు.సోమవారం పదర మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సర్వసభ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.సర్పంచులు గ్రామాల్లో అందుబాటులో ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించి, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపే అవకాశం ఉంటుందన్నారు.అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే అధికారులను, సర్పంచులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై సమీక్షించారు.కార్యక్రమంలో డీఈ హేమలత, తహసిల్దార్ సురేష్ బాబు, ఎంపీడీవో సుధాకర్, ఎంపీఓ వైద్యశాఖ అధికారి పావని, పశు వైద్యశాఖ అధికారి పల్లవి, విద్యుత్ ఏఈ ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





తెలుగు రాష్ట్రాల్లో నేటి బంగారం, వెండి ధరలు ఇలా..

గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పడుతున్న బంగారం ధరల ధోరణి ఈరోజు (మంగళవారం) కూడా కొనసాగింది. దేశీయ మార్కెట్లలో పసిడి ధరలు స్వల్పంగా తగ్గడం కొనుగోలుదారులకు ఊరటనిచ్చే అంశం.తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలలో బంగారం ధరలు స్థిరంగా ఉన్నాయి. ఇక్కడ 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర ?1,41,690గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర 1,54,570గా నమోదైంది. అదేవిధంగా, 18 క్యారెట్ల బంగారం ధర 1,15,930 వద్ద ట్రేడ్ అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో మాత్రం ధరల్లో స్వల్ప వ్యత్యాసం కనిపిస్తోంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 1,41,840గా, 24 క్యారెట్ల ధర 1,54,720గా పలుకుతోంది.బంగారం బాటలోనే వెండి ధరలు కూడా దిగివచ్చాయి. హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో కిలో వెండి ధర 100 మేర తగ్గి, ప్రస్తుతం ?2,49,900గా ట్రేడ్ అవుతోంది. అయితే, పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం నమోదైనవి కాబట్టి, కొనుగోలుదారులు స్థానిక ఆభరణాల దుకాణాల్లో కచ్చితమైన ధరలను సరిచూసుకోవడం ఉత్తమం. అంతర్జాతీయ పరిణామాలు, డాలర్ విలువ, స్థానిక పన్నుల ఆధారంగా ఈ ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి.

అన్ని శాఖల సిబ్బంది ఎఫ్ఆర్ఎస్‌లో తప్పనిసరిగా నమోదు కావాలి

వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు

నమోదైన సిబ్బందికే వేతనాలు

అన్ని శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశాలు



నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)లో తప్పనిసరిగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. మండల, డివిజన్, క్లస్టర్, గ్రామ స్థాయిల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగిని ఎఫ్ఆర్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని, సిబ్బంది నమోదు ప్రక్రియను ఈ నెలలోపు పూర్తి చేయాలని అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ముఖ హాజరు ఏర్పాట్లు అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయంలతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల సిబ్బంది హాజరు,వాస్తవ సిబ్బంది సంఖ్యను ఖచ్చితంగా నిర్ధారించేందుకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.కొన్ని శాఖల్లో సిబ్బంది ఇంకా ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు కాలేదని గుర్తించినట్లు తెలిపారు.ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ నమోదును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.శాఖల వారీగా పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య,ఎఫ్ఆర్ఎస్‌లో నమోదైన ఉద్యోగుల సంఖ్యను పరిశీలించాలని సూచించారు.నమోదు కాని సిబ్బందిని వెంటనే ఎఫ్ఆర్ఎస్ పరిధిలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.వ్యవసాయం,పశుసంవర్ధక, ఉద్యానవన తదితర శాఖలు ఇప్పటికే తమ శాఖలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ వ్యవస్థలను వినియోగిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన శాఖల సిబ్బంది అందుబాటులో ఉన్న ఈ-ఎస్‌పీఎస్ ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థను ఉపయోగించి హాజరు నమోదు చేయాలని సూచించారు.ఎఫ్ఆర్ఎస్ నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులు ఈడిఎంతో సమన్వయం చేసుకుని వెంటనే పరిష్కరించుకోవాలని ఆదేశించారు.ఎఫ్ఆర్ఎస్ నమోదు,హాజరు విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి శాఖ అధికారి బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.వచ్చే నెల నుంచి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు కాని సిబ్బంది వివరాలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి, అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదయ్యే హాజరుకు అనుగుణంగా వేతన చెల్లింపులపై చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత శాఖల అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎఫ్ఆర్ఎస్ ఆధారిత హాజరు నమోదును క్రమబద్ధీకరించాలని, అధికారులు తమ పరిధిలోని సిబ్బంది హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను అధికారులు సత్వరం పరిష్కరించి, ఆ వివరాలను సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు.సోమవారం నాగర్ కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.చేన్నయ్య, దేవ సహాయంలతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. సీఎం ప్రజావాణి ద్వారా నాగర్ కర్నూల్ జిల్లాకు అందుతున్న ప్రజా వినతులను సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖకు పంపించి, దాని పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. స్వీకరించిన వినతులు, ఆర్జీలకు సంబంధించిన పురోగతి, పరిష్కార వివరాలను సంబంధిత ఆర్జీదారులకు ఫోన్ ద్వారా తెలియజేయాలని సమస్యను పరిష్కరించడం సాధ్యం కాని సందర్భాల్లో అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొంటూ నివేదిక రూపొందించి, ఆ విషయాన్ని కూడా సంబంధిత ఆర్జీదారునికి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా స్పందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులను వేగవంతం చేయాలి

2026-27లో భూసేకరణకు రూ.6 వేల కోట్ల వరకు నిధులు

ఇప్పటికే రూ.2,550 కోట్లు విడుదల..లబ్ధిదారులకు పరిహారం చేరేలా చర్యలు

జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం





నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
పునరావాసం-పునరావాస పునరుద్ధరణ (ఆర్‌అండ్‌ఆర్) పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులను తక్షణమే పూర్తి చేసి, విడుదలైన నిధులు లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ పనుల పురోగతిపై సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సమావేశంలో పాల్గొన్నారు.నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.నాగర్‌కర్నూల్ జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వివరించారు. ప్రాజెక్టుల వారీగా భూసేకరణ పురోగతి, పెండింగ్‌లో ఉన్న భూములు, పరిహారం చెల్లింపుల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, అర్హులైన భూ నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం అందేలా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.భూసేకరణకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించే దిశగా జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. నీటిపారుదల శాఖ, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ప్రాజెక్టుల పనులకు భూసేకరణ లేదా అటవీ సంబంధిత అంశాల కారణంగా జాప్యం ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.భూసేకరణ ప్రక్రియలో రైతులు, భూ నిర్వాసితులతో అధికారులు నేరుగా సంప్రదింపులు జరపాలని,వారి సమస్యలు, అభ్యంతరాలను నిబంధనల పరిధిలో పరిష్కరించి, భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు.పరిహారం చెల్లింపులకు సంబంధించి అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, నిధులు విడుదలైన వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశాలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ, ప్రతి వారం పురోగతిని సమీక్షించాలని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు.ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.విడుదలైన నిధులు లబ్ధిదారులకు చేరేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులను గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధవి కలెక్టరేట్ సూపరింటెండెంట్ నారాయణ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలి

ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

విచారణలు పూర్తి చేసి నోటీసులన్నీ అందజేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి






నారాయణపేట, మన ప్రజాపక్షం:
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఫారం 6, 7, 8 ద్వారా అందిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు నమోదు, పేర్ల తొలగింపు, వివరాల సవరణకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియపై జిల్లాల వారీగా సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నారాయణపేట జిల్లా నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిహెచ్ ప్రియాంక వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల నమోదు అధికారి లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులకు సంబంధించిన విచారణలను సకాలంలో పూర్తి చేయాలని, జారీ చేసిన నోటీసులన్నీ సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పొలిటికల్ పార్టీలకు, మీడియాకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి

ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలి

నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

రాష్ట్ర ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జారీ, హియరింగ్‌లు, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారానికి సంబంధించిన తాజా వివరాలను ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు మీడియాకు వివరాలను వెల్లడిస్తూనే జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తిచేసి,సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు.సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్లు చెన్నయ్య, సలోని చాబ్రాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించి నోటీసుల జారీ, పెండింగ్‌లో ఉన్న నోటీసులు, హియరింగ్‌ల నిర్వహణ, ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.గత ఐదు రోజులుగా పెండింగ్‌లో ఉన్న నోటీసులకు గల కారణాలను రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ నోటీసులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నోటీసుల జారీ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి,అనంతరం సంబంధిత వ్యక్తులకు హియరింగ్ నిర్వహించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు.బీఎల్ఓలు, బీఎల్ఏల సహాయంతో సంబంధిత ఓటర్లకు నోటీసులు సక్రమంగా అందేలా చూడాలని, నోటీసుల జారీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు.విదేశాల్లో ఉన్న వ్యక్తులకు నోటీసులు జారీ అయిన సందర్భంలో నిబంధనల ప్రకారం వారి కుటుంబ సభ్యులకు నోటీసులు అందజేసి, అందుకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరును ఏఈఆర్ఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఆన్‌లైన్‌లో డేటా నమోదు, నోటీసుల వివరాలు, పెండింగ్ అంశాలను పరిశీలిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల అధికారి ఇచ్చిన సూచనలు, మార్గదర్శకాలను పక్కాగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. నోటీసుల జారీ నుంచి హియరింగ్‌ల వరకు ప్రతి దశను పర్యవేక్షిస్తూ, ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు, మీడియాకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ల నూతన కమిటీ ఎన్నిక

జనగామ, మన ప్రజాపక్షం:జనగామ జిల్లా కేంద్రంలో స్థానిక మల్లన్న గుడి ఆవరణలో మండల అధ్యక్షులు నల్ల మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జనగామ జిల్లా అధ్యక్షులు జేరుపోతుల కుమార్ విచ్చేసి అన్ని యూనియన్ల డ్రైవర్ల, పెద్దమనుషుల ఏకాభిప్రాయంతో జనగామ పట్టణ ఆటో యూనియన్ల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అనంతరం జేరుపోతుల కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని యూనిఫామ్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, బాధ్యతగా డ్రైవింగ్ చేయాలని,మాహాలక్ష్మి పథకం ద్వారా ఎంతోమంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు.ఓలా, ఉబర్,రాపిడో బైక్ రైడర్స్ లాంటి ప్రైవేట్ యాప్స్ ఎత్తి వేయాలని కోరుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.లీగల్ అడ్వైజర్ గా రాగల్ల శ్రీహరి,అధ్యక్షులుగా బాల్దే శ్రీశైలం,ప్రధాన కార్యదర్శిగా



బూడిద ప్రశాంత్, కోశాధికారి తిప్పాతి బాలస్వామి, సోషల్ మీడియా ఇన్చార్జి ఎండి.యాకూబ్ సోను,ఉపాధ్యక్షులుగా ఎండి.అంజాద్,ఎండి.సయ్యద్, బండి జగన్, గణిపాక రవి, మంగ శ్రీను, మేకల నరేష్,కార్యదర్శులుగా ఎండి.గౌస్, కొడం దామోదర్, బండ్రు మల్లేష్, పెరబోయిన మధు, దేవరాయ మహేష్, ఎండి మునీర్,సహాయ కార్యదర్శులుగా మచ్చ సత్యనారాయణ, చెరిపల్లి మల్లేష్, ఎండి.అబ్బు, ఎండి.జాంగిర్,బర్ల నరసింహులు,ఆర్గనైజర్స్ ఎం.డి.ఫక్రుద్దీన్, ఎస్.డి నైమద్, నల్ల పరశురాములు, బెజ్జం ఎల్లేష్, కార్యవర్గ సభ్యులుగా పిట్టల శ్రీను, కూకట్ల బాల్ నర్సయ్య, చీర శ్రీను, ఎండి అంజాద్ ఖాన్, చేవెల్లి యాకుమార్, నందన బోయిన నరసింహ, గణిపాక కుమార్, ఎండి సులేమాన్, మంగ రామచంద్రం, దామెర భాస్కర్ మరియు అన్ని అడ్డాల డ్రైవర్లు, పెద్ద మనుషులు పాల్గొన్నారు.

జనగామ ఎంసిహెచ్ ఆసుపత్రిలో రోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

బిఆర్ఎస్ యూత్ నాయకులు సయ్యద్ అస్లాం

జనగామ, మన ప్రజాపక్షం:జనగామ ఎంసిహెచ్ ఆసుపత్రిలో సరైన వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ లేకపోవడంతో రోగులు మరియు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి అని బిఆర్ఎస్ యూత్ నాయకుడు సయ్యద్ అస్లామ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి వార్డుల్లో పారిశుద్ధ్యం సరిగా లేకపోవడం, దోమలు ఎక్కువగా ఉండటం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దోమల నుంచి రోగులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.అలాగే ఆసుపత్రిలో అవసరమైన మందుల స్టాక్ అందుబాటులో లేకపోవడంతో బయట నుంచి మందులు కొనుగోలు చేయాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు తక్షణమే దృష్టి సారించి అవసరమైన అన్ని మందులను ఆసుపత్రిలో అందుబాటులో ఉంచాలి అని అన్నారు.గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఎంసిహెచ్ ఆసుపత్రి అవసరమైన సదుపాయాలతో సక్రమంగా పనిచేసేదని, రోగులకు వైద్యం అందించడంలో పెద్దగా ఇబ్బందులు ఉండేవి కావని ప్రజలు గుర్తు చేస్తున్నారు.ప్రస్తుతం ఎంసిహెచ్ ఆసుపత్రి సమస్యలపై ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వైద్యం, మందులు, పారిశుద్ధ్యం, దోమల నివారణ





మరియు రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి.రోగులకు మెరుగైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని జనగామ ఎంసిహెచ్ ఆసుపత్రి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సయ్యద్ అస్లామ్ డిమాండ్ చేశారు.

ఈశాన్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం







నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని రామ్ నగర్ కాలనీ పదో వార్డులో ఈశాన్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డు కౌన్సిలర్ జెపి చారి కుటుంబ సమేతంగా విచ్చేసి భక్తులకు స్వామివారి అన్న ప్రసాదం అందజేశారు. అనంతరం ఈశాన్ యూత్ సభ్యులు వార్డు కౌన్సిలర్ జెపి చారి దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈశాన్ యూత్ సభ్యులు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా 11రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ప్రతీ రోజు ఒక్కో పూజా కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఈ అన్న ప్రసాద కార్యక్రమానికి సహకరించిన దాతలకు పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఇలాగే మా ప్రతి కార్యక్రమానికి అందరి సహాయ సహకారాలు అందించాలని కోరారు.ప్రతీ సంవత్సరం పెద్ద ఎత్తున గణేశుడి పూజలు చేయడానికి ముందుంటామని తెలిపారు.అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కాలనీవాసులకు పట్టణ ప్రజలకు ఈశాన్ యూత్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనివాసులు, భక్తులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



గణనాథుని సన్నిధిలో సామూహిక కుంకుమార్చన

జనగామ, మన ప్రజాపక్షం:
బచ్చన్నపేట మండలం కేంద్రంలోని అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం గణనాథుని సన్నిధిలో మహిళలు విశేషంగా కుంకుమ పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. కాలనీ మహిళలు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ విఘ్నేశ్వరుని ఆశీస్సులు లభించాలని, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జ్యోతి, కవిత, భాగ్యలక్ష్మి, మమత, సంధ్య, అనూష, మహాలక్ష్మి, రాణి, నాగవైష్ణవి గీతిక, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నిర్వహించారు.



హలో ఉద్యమకారుడా ఈ నెల 27న చలో యాదగిరిగుట్ట

టీయుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్

జనగామ, మన ప్రజాపక్షం:
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయుఎఫ్) 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈ నెల 27న యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించనున్నట్లు టీయూఎఫ్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, జిల్లా ఉద్యమకారులతో కలిసి ఆవిర్భావ దినోత్సవ వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.?గత తొమ్మిది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రతి జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో పర్యటిస్తూ ఉద్యమకారులను ఐక్యం చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. టీయుఎఫ్ నిరంతర పోరాటాల ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారుల హామీలను అమలు చేయుటకు కమిటీనీ ఏర్పాటు చేసింది అన్నారు. ఈ ప్రక్రియకు టీయుఎఫ్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 27న జరిగే వేడుకకు రాష్ట్ర నలుమూలల నుండి ఉద్యమకారులు రాజకీయాలకు అతీతంగా తరలివచ్చి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా యాదగిరిగుట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ మరియు తొర్రూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజులను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించి, సభకు తప్పకుండా హాజరవుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఉద్యమకారులు తమ వద్ద ఉన్న ఉద్యమ చరిత్ర కాపీలు, ఎఫ్.ఐ.ఆర్ కాపీలు, జైలు శిక్షల వివరాలు మరియు అమరుల కుటుంబాల వివరాల జిరాక్స్ ప్రతులను సభ వద్ద కమిటీ సభ్యులకు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీయుఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు జోగు ఆంజనేయులు, నాగరాజు, దయానంద్, జగన్, ఆర్.కే. భూపాల్, మహిళా రాష్ట్ర కమిటీ ప్రతినిధి శ్యామల, సోమాపురం శంకర్, సిద్ధులు, చంద్రభాను పాల్గొన్నారు. అలాగే జనగామ మాజీ జిల్లా అధ్యక్షుడు తిప్పారపు ఆనంద్, జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈగం శ్రీనివాస్, బోడ రమేష్, నియోజకవర్గ కన్వీనర్ కడింగుల బాలకృష్ణ, బొల్లం భాస్కర్, లాజర్, మురళి తదితరులు పాల్గొన్నారు.



మహిళా సేవాదళ్ కమిటీల బలోపేతానికి కృషి

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మహిళా సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షురాలు పడాల సంగీత జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మి నారాయణ లకావత్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జనగామ జిల్లాలో మహిళా సేవాదళ్ కమిటీల ఏర్పాటు, విధివిధానాలు, సంస్థాగత కార్యక్రమాలపై ఇరువురు చర్చించారు.గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మహిళా సేవాదళ్‌ను బలోపేతం చేయడంతో పాటు, పార్టీ కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచే అంశాలపై చర్చించారు.జనగామ జిల్లాలో మహిళా కాంగ్రెస్ సేవాదళ్ కమిటీలను జిల్లా స్థాయి, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి, గ్రామ స్థాయిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయా స్థాయిల్లో బాధ్యతలు చేపట్టి పార్టీ కోసం పనిచేయడానికి ఆసక్తి, నిబద్ధత, విధేయత కలిగిన మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు రావాలని వారు కోరారు.మహిళా సేవాదళ్ కమిటీల ద్వారా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంతో పాటు, మహిళలను పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జాయ మల్లేష్,మహిళా సేవాదళ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మేరీ, జనరల్ సెక్రటరీ విజయ, అరుణ, కోశాధికారి పద్మ, జనరల్ సెక్రటరీ రవి,ప్రభాకర్ రెడ్డి,జిల్లా జనరల్ సెక్రటరీ బిర్రు సత్యనారాయణ, గుగులోతు కిషన్, పట్టణ 14వ వార్డు కౌన్సిలర్ అండాలు, బుట్రెడ్డి శ్రీలత రెడ్డి, మున్నీ బేగం తదితరులు పాల్గొన్నారు.



జనగామలో ఆధ్యాత్మిక శోభ...ఘనంగా గణనాథుని దీపారోత్సవం

జనగామ, మన ప్రజాపక్షం:జనగామ పట్టణంలోని వాసవి కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కాలనీలోని శ్రీ గణేష్ మండపం వద్ద సోమవారం దీపారోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని మహిళలందరూ విశేష సంఖ్యలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ వినాయక స్వామివారికి భక్తిశ్రద్ధలతో దీపారాధనలు సమర్పించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకకు మహిళల నుంచి విశేష స్పందన లభించడంతో పాటు, ప్రతి ఒక్కరూ ఉత్సాహంతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దీపారోత్సవ కార్యక్రమాన్ని ఎంతో క్రమశిక్షణతో, శ్రద్ధాభక్తులతో నిర్వహించి దిగ్విజయం చేసిన కాలనీ మహిళలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇదే తరహా సహకారాన్ని అందిస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ ప్రతినిధులు కోరారు.



ధర్మ సమాజ్ పార్టీ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

నారాయణపేట, మన ప్రజాపక్షం:
ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జ్ హరప్పన్ మహారాజ్ పర్యవేక్షణలో నారాయణపేట జిల్లా ధర్మ సమాజ్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర నాయకులు హరప్పన్ మహారాజు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులను ప్రకటించడం జరిగింది.జిల్లా అధ్యక్షులుగా పొర్ల డేవిడ్, ఉపాధ్యక్షులుగా బలిజ వీరేష్, ప్రధాన కార్యదర్శిగా గువ్వల శివరాజ్.కార్యదర్శులుగా దానపొల్ల రమేష్, టి.విజయ్ కుమార్,ఈశ్వర్, కోశాధికారిగా జి. కృష్ణ,కార్యవర్గ సభ్యులుగా అంజనేయులు,నాయబ్రాహ్మణ, సిహెచ్.నరేష్, మల్లికార్జున్, అశోక్,సోషల్ మీడియా ఇంచార్జిగా నరేష్ ముదిరాజ్ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ రాజశేఖర్ అడ్వకేట్ ముదిరాజ్, కోకన్వీనర్ బలిజ వీరేష్, అంజి,నాయి బ్రాహ్మణ మాదిగ జాగృతి సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున మహారాజ్ తదితరులు పాల్గొనడం జరిగింది.



ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నారాయణపేట, మన ప్రజాపక్షం :
ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సాయంత్రం వీసీ హాల్‌లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, వివరాల సవరణకు సంబంధించి ఫారం-6, ఫారం-7, ఫారం-8 వినియోగంపై ప్రతినిధులకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, జాబితాలో తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా దరఖాస్తులు, అభ్యంతరాలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిశీలన, పరిష్కారం, తుది ఓటరు జాబితా ప్రచురణకు సంబంధించిన షెడ్యూల్‌ను సమావేశంలో వివరించారు.ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు, ఫారం-7 ద్వారా అభ్యంతరాలు/పేరు తొలగింపునకు సంబంధించిన దరఖాస్తులు, ఫారం-8 ద్వారా ఓటరు వివరాల సవరణ తదితర సేవలను పొందవచ్చని తెలిపారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితా పరిశీలనలో భాగస్వాములు కావాలని, అర్హులైన ఓటర్ల నమోదు మరియు జాబితా ప్రక్షాళనలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎన్నికల విభాగం అధికారిని జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సుదర్శన్ రెడ్డి, మహ్మద్ సలీం, రాఘవ చౌదరి, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజావాణిలో (481) దరఖాస్తుల స్వీకరణ
జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, మన ప్రజాపక్షం:
జిల్లాలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు.అదే విధంగా పెండింగ్ లో గల ఆర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.ఈ ప్రజావాణిలో మొత్తం (481) దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు.ప్రజావాణికి వచ్చిన కొన్నింటి దరఖాస్తులు వివరాల ప్రకారం రఘునాథపల్లి మండలం, గబ్బెట గ్రామానికి చెందిన సీహెచ్. అఖిల, ప్రజాపాలన కార్యక్రమం కింద దరఖాస్తు చేసుకున్నారని, ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద ఆర్థిక సహాయం మంజూరు చేయగలరని విజ్ఞప్తి చేస్తూ అర్జీని సమర్పించారు. పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామానికి చెందిన అనుముల కొంరయ్య, తన ఇంటికి వెళ్లే రహదారి బాటను కబ్జా చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మనవి చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు.ఘనపూర్ (స్టేషన్) మండలం ఛాగల్ గ్రామానికి చెందిన సత్తు పోషాలు, తన ఒక ఎకరం 17 గుంటల భూమి, 2018 నుంచి తన పేరుపై రావడం లేదని, దానిని రద్దు చేసి, నా భూమి పట్టా ఇప్పించగలరని విన్నవిస్తూ దరఖాస్తును సమర్పించారు. దేవరుప్పుల మండలం, సీతాపురం గ్రామానికి చెందిన డీ.సత్తచీ, తన భూమిని సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేయగరలని కోరుతూ దరఖాస్తును సమర్పించనైనది.నర్మెట్ట మండలం కన్నెబోయినగూడెం గ్రామానికి చెందిన కలకుంట్ల అయిలమ్మ, తనకు స్థలం ఉందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు మంజూరు చేయగలరని కోరుతూ దరఖాస్తును సమర్పించారు. ఈ ప్రజావాణిలో జెడ్పీ సీఈవో బలరామ రావు, డీఆర్డీఓ భాస్కర్, సీపీఓ చినకోట్యా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యకర్తలే పార్టీకి సైనికులు

బీఆర్ఎస్ హయాంలో అక్రమాస్తులు..
కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి
నా ఎంపీ నిధులపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది
నిధులు కేటాయించకుండా 20 శాతమే ఖర్చు చేశారని దుష్ప్రచారం చేస్తున్నారు
రూ.14.70 కోట్లలో దాదాపు రూ.12 కోట్లు నిధులు
నియోజకవర్గాల్లో అభివృద్ధికి కేటాయించాం
నిధులు మంజూరు చేసిన తర్వాత పనుల అమలు బాధ్యత అధికారులదే
కనీస అవగాహన లేకుండా బీఆర్ఎస్ ప్రచారం చేయటం సిగ్గుచేటు
స్టేషన్ ఘన్‌పూర్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం
కడియం శ్రీహరి నాయకత్వంలో ఐక్యంగా పనిచేయాలి
వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

జనగామ ప్రతినిధి, మన ప్రజాపక్షం:
కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని, నూతనంగా బాధ్యతలు చేపట్టిన పార్టీ కమిటీలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలంతా పార్టీకి సైనికుల్లా పనిచేయాలని తెలిపారు. ధర్మసాగర్ మండలంలోని సుష్మిత గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన నూతన మండల కాంగ్రెస్ కమిటీ, గ్రామ కాంగ్రెస్ కమిటీల పరిచయ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తో కలిసి వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంత కుముందు ధర్మసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూలి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని ఎంపీ తెలిపారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 100 పడకల ఆసుపత్రి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ వంటి అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.

ఎంపీ నిధులపై బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం

బీఆర్ఎస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య గట్టి సమాధానం ఇచ్చారు. ఎంపీ నిధుల విషయంలో వాస్తవాలను పక్కదారి పట్టిస్తూ తాను కేవలం 20 శాతం నిధులు మాత్రమే వినియోగించానంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఎంపీ మండిపడ్డారు. తనకు ఇప్పటివరకు వచ్చిన రూ.14.70 కోట్ల ఎంపీ నిధుల్లో దాదాపు రూ.12 కోట్లు ఇప్పటికే వివిధ అభివృద్ధి పనులకు కేటాయించినట్లు స్పష్టం చేశారు.నిధులు మంజూరు చేసిన తర్వాత పనుల అమలు బాధ్యత అధికారులదే అని పేర్కొన్నారు. ఎంపీ నిధులు ఒకసారి సంబంధిత పనులకు కేటాయించిన తర్వాత టెండర్లు, పనుల ప్రారంభం, నిర్మాణ పురోగతి వంటి అంశాలను కలెక్టర్లు, చీఫ్ ప్లానింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుందని వివరించారు. నిధులు విడుదల చేయడం, పనులు పూర్తిచేయడం రెండింటినీ కలిపి చూపిస్తూ తనపై ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అక్రమాస్తులు

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అధికారం అడ్డుపెట్టుకుని భారీగా అక్రమాస్తులు కూడబెట్టారన్నారు. ఎంపీ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన భూవ్యవహారాలపై తాను, ఇతర ప్రజాప్రతినిధులు పరిశీలించినట్లు తెలిపారు. కొన్ని భూముల పత్రాలు, ఎన్ఓసీలు, అనుమతులపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. భూవ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమమని తేలిన ఆస్తులను స్వాధీనం చేసుకుని పేదలు, దళితుల ప్రయోజనాలకు వినియోగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కేంద్రం నుంచి నిధుల కోసం నిరంతర ప్రయత్నం

వరంగల్ అభివృద్ధికి కేంద్ర మంత్రులను నిరంతరం కలుస్తూ వివిధ అంశాలపై ప్రతిపాదనలు అందిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. అలాగే తాను పార్లమెంటులో వరంగల్ సమస్యలను నిరంతరం ప్రస్తావిస్తూ, కేంద్ర మంత్రులను కలిసి అభివృద్ధి పనుల కోసం నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నానని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు. రైల్వేలు, జాతీయ రహదారులు, విద్య, ఆలయాల అభివృద్ధి, కాకతీయ యూనివర్సిటీ, మామునూరు విమానాశ్రయం, టెక్స్‌టైల్ పార్కు, రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ తదితర అంశాలపై కేంద్రంతో నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి


కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎంపీ సూచించారు. పార్టీలో అంతర్గత విభేదాలకు తావివ్వకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని అన్నారు.స్టేషన్ ఘన్‌పూర్ తన పుట్టినిల్లు అని, ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకోలేనిదని ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. ఎంపీగా తనకు వచ్చే నిధుల్లో స్టేషన్ ఘన్‌పూర్‌కు ప్రాధాన్యం ఇస్తున్నానని తెలిపారు.కడియం శ్రీహరి నాయకత్వంలో రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. "కడియం అంటేనే స్టేషన్ ఘన్‌పూర్‌కు అంకితం అని ఎంపీ అన్నారు.తన తండ్రి కడియం శ్రీహరి రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ ఎక్కడా అవినీతికి తావులేకుండా ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. రానున్న రెండేళ్లలో కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు ఇనాగల వెంకట్రామ్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ప్రసాద్, సర్పంచులు, నూతన మండల కమిటీ సభ్యులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి సాహసం.. అమెరికా ఆంక్షలు..
బుష్ ఉపసంహరణ.. ఆసక్తికర కథనం!

భారతదేశ చరిత్రలో 1998 మే నెల ఒక సువర్ణాధ్యాయం. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం, ప్రపంచ దేశాల అంచనాలను తలకిందులు చేస్తూ పోఖ్రాన్‌లో అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. 'ఆపరేషన్ శక్తి' పేరుతో మే 11న, ఆ తర్వాత రోజుల్లో జరిపిన ఈ పరీక్షలతో భారత్ పూర్తి అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన దేశంగా ప్రపంచానికి చాటిచెప్పింది. అయితే, ఈ సాహసోపేత నిర్ణయానికి అమెరికా నుంచి తీవ్ర ప్రతిస్పందన ఎదురైంది.భారత్ అణు పరీక్షలు నిర్వహించిన వెంటనే, అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రభుత్వం కఠిన ఆంక్షలను విధించింది. అమెరికా ఆయుధ ఎగుమతుల నియంత్రణ చట్టంలోని సెక్షన్ 102 (గ్లెన్ అమెండ్‌మెంట్) కింద ఈ చర్యలు తీసుకుంది. ఈ ఆంక్షల ప్రభావం భారత్‌పై బాగా పడింది.మానవత, ఆహార సహాయం మినహా అమెరికా నుంచి అందే ఆర్థిక సహాయాన్ని నిలిపివేశారు. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వంటి సంస్థల నుంచి భారత్‌కు అందాల్సిన కొన్ని బిలియన్ డాలర్ల రుణాలకు అడ్డుపడ్డారు.అంతేకాకుండా రక్షణ పరికరాల అమ్మకాలు, సైనిక ఆర్థిక సహాయంపై కఠినమైన ఆంక్షలు విధించారు. కొన్ని కీలక సాంకేతిక పరిజ్ఞాన బదిలీలు, రుణాలపై కూడా పరిమితులు విధించారు. అమెరికా చర్యలతో భారత్ ఏకాకి అవుతుందని చాలా దేశాలు భావించాయి.అయితే, ఈ కఠిన పరిస్థితుల్లో భారత్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. జాతీయ భద్రతా ప్రయోజనాల దృష్ట్యానే అణు పరీక్షలు నిర్వహించామని, ఏ బెదిరింపులకు భయపడబోమని భారత అధికారులు అప్పట్లో స్పష్టం చేశారు. ఆంక్షల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాలను అన్వేషించింది.



ఆశ్చర్యకరంగా ఆంక్షల తర్వాత కూడా భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా నిలిచింది. జీడీపీ వృద్ధి రేటు బలంగా కొనసాగింది.ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ, అమెరికాతో దౌత్యపరమైన చర్చలు కొనసాగాయి. దీనికి నిదర్శనంగా 2000 సంవత్సరంలో అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్‌లో పర్యటించారు. ఇది ఇరు దేశాల సంబంధాలలో ఒక కీలక మలుపుగా నిలిచింది.చివరకు 2001 సెప్టెంబర్ 22న అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ. బుష్ భారత్‌పై విధించిన అన్ని ఆంక్షలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం భారత్-అమెరికా మధ్య విస్తృత ఆర్థిక, వ్యూహాత్మక సహకారానికి మార్గం సుగమం చేసింది.నేటికీ ఇరు దేశాల మధ్య వాణిజ్యపరమైన చర్చలు లేదా ఇతర అంశాలపై విభేదాలు తలెత్తినప్పుడు, 1998 నాటి ఈ సంఘటనను ఒక ఉదాహరణగా ప్రస్తావిస్తుంటారు. ఆనాటి ఆంక్షలను తట్టుకుని నిలబడిన భారత్, నేడు అమెరికాకు ఒక కీలక వ్యూహాత్మక భాగస్వామిగా ఎదగడం చారిత్రక పరిణామం.




స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి: కాకాణి

పొదలకూరు, మన ప్రజాపక్షం :
రానున్న పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పొదలకూరులో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కీలకమని అన్నారు. ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలతో మమేకం కావాలని సూచించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, మహిళలు, కార్మికులు, వివిధ వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని కాకాణి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించాలని నాయకులకు సూచించారు. రానున్న పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని, గ్రామస్థాయిలో బలమైన సమన్వయంతో ముందుకు సాగాలని కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ బిట్ వన్ గంగవరపు లక్ష్మీ కళ్యాణి, మాజీ సర్పంచ్ వాకాటి శ్రీనివాసులు రెడ్డి, వైసిపి నాయకులు బచ్చల సురేష్ కుమార్ రెడ్డి, అంజాద్,వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగర్ కర్నూల్ సర్కార్ దవాఖానలో సౌకర్యాల లేమి - కలెక్టర్ కు ఫిర్యాదు

ఎంఆర్ఐ స్కానింగ్, అంబులెన్స్ సౌకర్యం కరువు - తాగునీటికి ఇబ్బందులు



నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం :
నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రజలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్ కు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు.జిల్లా ఆసుపత్రిలో ఎం.ఆర్.ఐ స్కానింగ్ సౌకర్యం అందుబాటులో లేదని, గర్భినులకు సంబంధించిన వైద్యం, అంబులెన్స్ సౌకర్యం కూడా సరిగా అందడం లేదని వాపోయారు. దూర ప్రాంతాల నుండి వచ్చే గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, కూలీలకు కనీస వసతులు లేవని, తాగడానికి మంచినీరు కూడా అందరికీ అందుబాటులో లేదని లేఖలో పేర్కొన్నారు.ప్రజలకు అందాల్సిన ఉచిత వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కాపీని ఆసుపత్రి సూపరింటెండెంట్, డీఎం ఉ హెచ్ఓ నాగర్ కర్నూల్ కు పంపినట్లు తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో పి.శంకర్, పి.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



1950 రాష్ట్రపతి ఉత్తర్వును రద్దు చేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

మఖ్తల్, మన ప్రజాపక్షం :1950 రాష్ట్రపతి ఉత్తర్వును రద్దు చేసి, క్రైస్తవ దళితులకు కూడా ఎస్సీ హోదా కల్పించాలని రాజ్యాంగ హక్కుల సాధన సమితి డిమాండ్ చేసింది.జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్ రామ్ అధ్యక్షతన మక్తల్‌లోని జీసస్ క్రిస్ట్ ఫెల్లోషిప్ చర్చిలో సమావేశమై రాజ్యాంగ హక్కుల సాధన, 1950 రాష్ట్రపతి ఉత్తర్వు, నూతన కమిటీ కార్యాచరణ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దండు సమృద్ధి కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం ప్రతి ఒక్కరికీ అందాలని అన్నారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వును రద్దు చేసి క్రైస్తవ దళితులకు సమాన హక్కులు కల్పించాలనే డిమాండ్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. నారాయణపేట జిల్లాలోని అన్ని మండలాలు, ప్రాంతాల్లో నూతన



కమిటీలను ఏర్పాటు చేసి, ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్ రామ్ మాట్లాడుతూ క్రైస్తవ మతాన్ని స్వీకరించిన దళితులు కూడా సమాజంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. మతం మారినంత మాత్రాన వారి సామాజిక పరిస్థితులు మారిపోవు. అందువల్ల క్రైస్తవ దళితులకు కూడా సమాన హక్కులు కల్పించేలా 1950 రాష్ట్రపతి ఉత్తర్వును రద్దు చేయాలన్నారు.అదేవిధంగా క్రైస్తవులందరిలో రాజకీయ చైతన్యం రావాలని, తమ రాజ్యాంగ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని ఐక్యంగా ముందుకు రావాలని అన్నారు.గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజల్లో అవగాహన పెంచి, నూతన కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు.రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడుతూ అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బండారి వినోద్ కుమార్, ట్రెజరర్ కిష్టఫర్, సలహాదారులు పాస్టర్ డేవిడ్, పాస్టర్ జాన్సన్, కమిటీ సభ్యులు శాంతప్ప,మక్తల్ ప్రాంతానికి చెందిన పాస్టర్ జాన్సన్, పాస్టర్ సమూయేలు, పాస్టర్ యోహాను, పాస్టర్ పీటర్, పాల్గొని సలహాలు సూచనలు ఇచ్చారు.

లోకుర్తి దళితుల ఇండ్లు కూల్చివేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

కూల్చబడ్డ ఇండ్ల స్థానంలో కొత్త ఇండ్లు నిర్మించాలి

నారాయణపేట, మన ప్రజాపక్షం: దామరగిద్ద మండలం లోకుర్తి గ్రామంలో దళితుల ఇల్లు కూల్చివేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు.సోమవారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర బాధితులతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.తరతరాలుగా జీవిస్తున్న దళితవాడపై కొంతమంది రెడ్డి కులానికి చెందిన వారు జెసిబి లతో దళిత నివాసాలను కూల్చివేయడం దారణమని విమర్శించారు.ఇంకా మిగిలి ఉన్న ఇళ్లను కూడా కూల్చివేస్తామని లీగల్ నోటీసులు



దళితులకు పంపించి భయభ్రాంతులకు గురి చేయడం అత్యంత హేయమైన చర్యని మండిపడ్డారు.ఎన్నో ఏళ్లుగా జీవిస్తున్న దళితుల ఇళ్లపై జెసిపిలతో కూల్చివేసిన వారిపైన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, వారిని జైలుకు పంపాలని కూల్చివేసిన ఇళ్ల స్థానంలో దళితులకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలాయా గౌడ్, సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం,దళిత సంఘాల నాయకులు చిన్నయ్య, గజలప్ప, మాట్లాడారు.దళిత నివాసలపై జెసిపిలతో దాడి చేసి కూల్చివేసిన వారిపైన పోలీసు యంత్రాంగం ఎలాంటి చర్య తీసుకోకపోవడం దారుణం అన్నారు.అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనుకు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శివకుమార్ బాబు, హనుమంతు, లోకుర్తి దళిత బాధితులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల చెమట చుక్కే ఆసుపత్రికి జీవం... అణచివేతపై ఉద్యమ తూటై పేలే పాట ఆవిష్కరణ!

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైభవంగా ఎస్పిఎస్ ఆసుపత్రి సిబ్బంది ఉద్యమ గీతావిష్కరణ

ఖమ్మం,మన ప్రజాపక్షం :ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో అహర్నిశలు ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందిస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది న్యాయమైన హక్కుల సాధనకై, వారి భవిష్యత్తుకు వెలుగు బాటలు పరిచేందుకు రూపొందించిన ప్రత్యేక ఉద్యమ గీతం (సాంగ్) విడుదల కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ ఆవిష్కరణ సభకు ఎస్.పి.ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ మాతంగి అనిల్ కుమార్ గారు అధ్యక్షత వహించి, కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. అనంతరం ఈ విప్లవ గీతాన్ని ఎస్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్రు సైదయ్య,నాయకులు చిన్న బోస్కో నరేష్, పత్తిపాటి శ్రీనివాసరావు, సంయుక్తంగా విడుదల చేశారు.ఈ సందర్భంగా నాయకులు ఎస్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాతంగి అనిల్ కుమార్ మాట్లాడుతూ "చెమట చుక్కే మా ఊపిరి... మా శ్రమే ఈ ఆసుపత్రికి జీవం!" అనే నినాదంతో కార్మికుల శ్రమను, వారి ఆత్మగౌరవాన్ని ప్రతీకగా చూపేలా ఈ పాట



రూపుదిద్దుకుందని తెలిపారు. ఇది కేవలం కొన్ని పదాల అమరిక మాత్రమే కాదని, అణచివేతకు గురవుతున్న ప్రతి కష్టజీవి గుండె చప్పుడని కొనియాడారు. కార్మిక లోకంలో హక్కుల చైతన్యం రగిల్చే ఈ పాట ప్రతి ఒక్కరి వద్దకు చేరాలని ఆకాంక్షించారు.కార్మికుల సమస్యలను, వారి పోరాట స్ఫూర్తిని కళ్ళకు కట్టినట్లు అద్భుతంగా రచించిన ఎస్పీఎస్ ఖమ్మం జిల్లా ప్రచార కార్యదర్శి / రచయిత మద్దెల మధుని రాష్ట్ర కమిటీ నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విప్లవాత్మక గీతావిష్కరణలో ఎస్పిఎస్ రాష్ట్ర కమిటీ ప్రచార కార్యదర్శి ఏ.ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు చాగంటి నాగమణి, ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు బక్తుల మమత, ప్రధాన కార్యదర్శి కర్ష జగదీష్, ఉపాధ్యక్షులు రాయల రమ్య, గుగ్గిళ్ళ నాగేంద్ర, గుగ్గులోతు శ్యాము, భూక్య సోనీ, సహాయ కార్యదర్శి గద్దల కళ్యాణి, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు నాగభూషణం పాల్గొన్నారు. అలాగే జిల్లా కమిటీ సభ్యులు బి.సత్యవతి, ఆసుపత్రి శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాక్ క్రికెట్‌లో ముదురుతున్న వివాదం.. రిజ్వాన్ నోరు నొక్కిన పీసీబీ

పాకిస్థాన్ క్రికెట్‌లో సీనియర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌పై జరుగుతున్న విచారణ వ్యవహారం మరో కీలక మలుపు తీసుకుంది. తనపై వచ్చిన అవినీతి, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ ఆరోపణలపై బహిరంగంగా మాట్లాడకుండా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అతనిపై ఆంక్షలు విధించింది. ఈ వివాదంపై తన వాదనను ప్రజల ముందు ఉంచేందుకు రిజ్వాన్ చేసిన ప్రయత్నాలను పీసీబీ అడ్డుకోవడం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఇటీవలే ఇంగ్లండ్ పర్యటన నుంచి అర్ధాంతరంగా స్వదేశానికి పంపిన ఏడుగురు ఆటగాళ్లలో రిజ్వాన్, ఇమామ్-ఉల్-హక్ కూడా ఉన్నారు. 'ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్', అవినీతి ఆరోపణల నేపథ్యంలో పాకిస్థాన్ నేషనల్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌సీసీఐఏ) వీరిని విచారిస్తోంది. ఇందులో భాగంగా వారిని సుమారు రెండు గంటల పాటు ప్రశ్నించడమే కాకుండా వారి మొబైల్ ఫోన్లను కూడా పీసీబీ భద్రతా బృందం స్వాధీనం చేసుకుంది.పాకిస్థాన్‌కు చెందిన 'జియో న్యూస్' కథనం ప్రకారం.. ఈ మొత్తం వివాదంపై బహిరంగంగా వివరణ ఇచ్చేందుకు రిజ్వాన్ రెండుసార్లు పీసీబీ అనుమతి కోరాడు. తనపై వచ్చిన ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని భావించాడు. అయితే, సెంట్రల్ కాంట్రాక్ట్‌లోని క్లాజ్ 4.1 ప్రకారం బోర్డు అనుమతి తప్పనిసరి కావడంతో అతడు అభ్యర్థించాడు. కానీ, పీసీబీ అతని విజ్ఞప్తులను రెండుసార్లూ తిరస్కరించింది. పీసీబీని నిందించే ఉద్దేశం తనకు లేదని, కేవలం తన వాదనను మాత్రమే వినిపించాలనుకున్నట్లు రిజ్వాన్ సన్నిహిత



వర్గాలు తెలిపాయి.ఈ క్రమంలోనే ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్‌కు కూడా రిజ్వాన్ ఒక లేఖ రాశాడు. విచారణ ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని కోరాడు. మరోవైపు ఎన్‌సీసీఐఏకు కూడా అతడు ఘాటుగానే సమాధానం ఇచ్చాడు. "ఈ కేసులో ఎన్‌సీసీఐఏ ఎందుకు విచారణ జరుపుతుందో అర్థం కావడం లేదు. నాపై ఉన్న ఆరోపణల పూర్తి వివరాలు అందిస్తేనే విచారణకు సహకరించగలను" అని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఇప్పటికీ రిజ్వాన్ మొబైల్ ఫోన్‌ను తిరిగి ఇవ్వలేదని, ఫోన్‌లోని లావాదేవీలపై పీసీబీ లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

గణేష్ శోభాయాత్ర, నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్
సుమారు 800 మంది పోలీసులతో
కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
డీజేలకు అనుమతి లేదు...నిబంధనలు
ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
125 మంది డీజే నిర్వాహకులు, 25 మంది
రౌడీషీటర్లు, 77 మంది
కమ్యూనల్ షీటర్లు బైండోవర్
సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలు, వీడియో
గ్రఫీతో నిరంతర నిఘా



నారాయణపేట,మన ప్రజాపక్షం :
జిల్లాలో గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

1,728 గణేష్ విగ్రహాలకు ఆన్‌లైన్ నమోదు, జియో ట్యాగింగ్

జిల్లాలో మొత్తం 1,728 గణేష్ విగ్రహాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి జియో ట్యాగింగ్ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.దీని ద్వారా ప్రతి గణేష్ మండపం,విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతం, నిమజ్జనానికి సంబంధించిన వివరాలు పోలీసులకు ముందుగానే అందుబాటులో ఉండటంతో పాటు,శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు.

డీజేలకు అనుమతి లేదు

గణేష్ శోభాయాత్రల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు.సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ఆర్డీఓ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో డీజేలను నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి డీజేలను ఏర్పాటు చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇప్పటికే జిల్లాలో 125 మంది డీజే యజమానులు, ఆపరేటర్లను బైండోవర్ చేయడంతో పాటు, అవసరమైన చోట డీజేలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు.

ముందస్తు భద్రతా చర్యలు

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 25 మంది రౌడీషీటర్లు, 77 మంది కమ్యూనల్ షీటర్లు, మరో 54 మంది ఇతర వ్యక్తులను బైండోవర్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.జిల్లా కలెక్టర్, రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించడంతో పాటు గణేష్ ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు, ఆర్గనైజర్లు, యువత, మత పెద్దలతో పలు శాంతి సమావేశాలు నిర్వహించి శాంతియుతంగా పండుగను నిర్వహించడంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు చేస్తే కఠిన చర్యలు

గణేష్ నిమజ్జనం సందర్భంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే, అనుచిత, వివాదాస్పద పోస్టులు, వ్యాఖ్యలు చేయవద్దని ఎస్పీ సూచించారు.ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా పోస్టులు చేయడం, వదంతులు ప్రచారం చేయడం లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలి

గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా జిల్లాలో సుమారు 800 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.అదనపు ఎస్పీ-01,డీఎస్పీలు-02,సీఐలు-1,ఎస్సైలు-31,ఏఎస్ఐ/హెచ్‌సీలు-156,పోలీస్ కానిస్టేబుల్స్-347,హోంగార్డులు-116, టిజిపిఎస్ ప్లటూన్లు-03. నారాయణపేట, ఉట్కూర్, మక్తల్, కోస్గి పట్టణాల్లో ఇతర శాఖల అధికారుల సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ పరిస్థితులకు అనుగుణంగా వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా

శోభాయాత్ర జరిగే మార్గాలు, నిమజ్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.అదేవిధంగా డ్రోన్ కెమెరాలు, వీడియో గ్రఫీ ద్వారా శోభాయాత్రను రికార్డు చేస్తూ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని చెప్పారు.నిమజ్జన ప్రాంతాల్లో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజల భద్రతకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

నిమజ్జన సమయంలో ప్రజలు తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలు

బారికేడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటకూడదు,విగ్రహంతో పాటు కనీసం నలుగురు పెద్దలు ఉండేలా చూసుకోవాలి,అనుమతి లేని ప్రాంతాల్లో ఎవరూ నీటిలోకి దిగకూడదు,చిన్నారులను చెరువు, నది వైపు ఒంటరిగా పంపకూడదు,ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశాల్లోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలి,ఈత రాని వారు నీటిలోకి దిగకూడదు,ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలపై పరిమితికి మించి ప్రయాణించకూడదు,వాహనాలపై నిలబడి ప్రయాణించకూడదు,క్రేన్లు, పడవలు, స్విమ్మర్ల విధులకు ఎలాంటి ఆటంకం కలిగించకూడదు,విద్యుత్ వైర్లు, లైటింగ్ ఏర్పాట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి,నిమజ్జన ప్రాంతాల్లో తోపులాటకు పాల్పడకుండా క్రమశిక్షణ పాటించాలి,మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొనడం, వాహనాలు నడపడం చేయకూడదు,తప్పిపోయిన పిల్లలు, వృద్ధులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి,అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సమీప పోలీస్ సిబ్బందిని సంప్రదించాలి.నారాయణపేట జిల్లా కేంద్రంలో గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం మరియు తాఖీ బాబా దర్గా ఉర్సు కార్యక్రమాలు ఒకే సమయంలో జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు.ప్రజలు పరస్పరం సహకరించుకుంటూ మతసామరస్యాన్ని కాపాడాలని, తమ పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.ఎలాంటి వదంతులు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అనుచిత పోస్టులను సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.గణేష్ ఉత్సవాలు భక్తి, శాంతి, సోదరభావానికి ప్రతీకగా నిలవాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకుందాం. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని ఎస్పీ తెలిపారు. ఈ పత్రిక సమావేశం లో అదనపు ఎస్పీ ఎండి.రియాజ్ హుల్ హక్, డీఎస్పీ మహేష్, నల్లపు లింగయ్య,శివ శంకర్, మీడియా మిత్రులు పాల్గొన్నారు.



నారాయణపేట జిల్లాలో విదేశీ కలుపు మొక్కల నిర్మూలన కార్యక్రమం

నారాయణపేట, మన ప్రజాపక్షం:
స్థానిక జీవవైవిధ్యం మరియు పర్యావరణ వ్యవస్థల పరిరక్షణ కోసం సామూహిక చర్యలను బలోపేతం చేసేందుకు, జిల్లా స్థాయి అధికారులు మరియు శాఖాధిపతులను ఒకచోట చేర్చి, ఈకో ఫాన్ సొసైటీ ఈరోజు నారాయణపేట జిల్లాలో “విదేశీ కలుపు మొక్కల నిర్మూలన” అనే అవగాహన మరియు నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించింది.నారాయణపేట అదనపు కలెక్టర్ శ్రీను ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. విదేశీ కలుపు మొక్కల వ్యాప్తిని గుర్తించి, అరికట్టడానికి సమన్వయ ప్రయత్నాలను ప్రోత్సహిస్తూ, ఆయన ఈ ప్రచారంలో పాల్గొన్నారు.జిల్లా స్థాయి అధికారులు మరియు శాఖాధిపతులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, ఈ కార్యక్రమానికి తమ మద్దతును అందించారు.స్థానిక జీవవైవిధ్యం, నేల, వ్యవసాయం, నీటి వనరులు మరియు పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యంపై విదేశీ కలుపు మొక్కల ప్రభావాలను ఎత్తి చూపుతూ, ఈ ప్రచారం అవగాహన, గుర్తింపు, నిర్మూలన మరియు పర్యావరణ పునరుద్ధరణపై దృష్టి సారిస్తుంది.ప్రభుత్వ శాఖలు, స్థానిక సంఘాలు, సంస్థలు మరియు పౌరుల చురుకైన భాగస్వామ్యంతో తెలంగాణ వ్యాప్తంగా “థంబ్స్ డౌన్ ఉద్యమాన్ని” ముందుకు తీసుకెళ్లాలని ఈకో ఫాన్ సొసైటీ పిలుపునిచ్చింది.





టీబీ రహిత జిల్లాగా నారాయణపేటను తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట, మన ప్రజాపక్షం
:నారాయణపేట జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, వారికి సకాలంలో పరీక్షలు నిర్వహించి, సరైన వైద్య చికిత్స అందించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయడమే టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ఆధ్వర్యంలో పీహెచ్‌సీలు, ఎంపీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలలో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మండల స్థాయిలోనూ పరీక్షలు విస్తృతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 54,684 మందికి ఛాతీ పరీక్షలు, ఎక్స్‌రే స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు.ప్రత్యేకంగా ఇటుక బట్టీలలో పనిచేస్తున్న కార్మికులను గుర్తించి, వారికి తప్పనిసరిగా టీబీ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వంద శాతం స్క్రీనింగ్ పూర్తి చేసి, టీబీ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో అవసరమైన వాలంటీర్లను ఏర్పాటు చేసి, ప్రజలకు టీబీపై అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులను గుర్తించి వైద్య పరీక్షలకు పంపించాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వైద్య,పంచాయతీరాజ్, విద్య, కార్మిక తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్ర మోహన్, జిల్లా టీబీ అధికారి, డీవైఎస్ఓ, డీఈఓ, డీపీఓ, జిల్లా కార్మిక అధికారి తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులను వేగవంతం చేయాలి

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
2026-27లో భూసేకరణకు రూ.6
వేల కోట్ల నిధులు విడుదల
ఇప్పటికే రూ.2,550 కోట్లు విడుదల...లబ్ధిదారులకు
పరిహారం చేరేలా చర్యలు చేపట్టాలి
అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం
చెల్లింపులు తక్షణమే పూర్తి చేయాలి
భూసేకరణకు ప్రత్యేక అధికారులను నియమించి, ప్రతి
వారం పురోగతిపై సమీక్షించాలి
రైతులతో సంప్రదింపులు జరిపి నిబంధనల ప్రకారం,
మార్కెట్ విలువకు సమీపంగా పరిహారం అందించాలి
నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్
పనులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, సీఎస్





నారాయణపేట, మన ప్రజాపక్షం:
రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం,పునరావాసం-పునరావాస పునరుద్ధరణ (ఆర్‌అండ్‌ఆర్) పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సి హెచ్ ప్రియాంక ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు.నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులకు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.2026--27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు.ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.విడుదలైన నిధుల్లో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని అన్నారు.జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.నిధులు సరిపోకపోయినా, ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోయినా ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.విడుదలైన నిధులను అధికారుల వద్ద ఉంచి పనులను పెండింగ్‌లో పెట్టవద్దని స్పష్టం చేశారు.భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని,ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు.నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు.ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు.కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని భూసేకరణ పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు.ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు.రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.అవార్డు జారీ చేసిన తరువాత కూడా చాలా కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో అధిక మొత్తంలో పరిహారం కోరుతున్న కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సి హెచ్ ప్రియాంక మాట్లాడుతూ జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఇతర పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అత్యవసర రక్తదానానికి పది నిమిషాల్లో స్పందన

నాగర్‌కర్నూల్, మన ప్రజాపక్షం :అత్యవసరంగా »Oμ నెగెటివ్ (O-) రక్తం అవసరమని యూత్ రెడ్ క్రాస్ నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ దామగట్ల కుమార్ ఇచ్చిన పిలుపుకు ఇద్దరు రక్తదాతలు కేవలం పది నిమిషాల్లోనే స్పందించారు. అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శ్రీనివాసు, ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్, టిఫిన్ సెంటర్ వ్యాపారవేత్త చంద్రశేఖర్ వెంటనే ముందుకు వచ్చి రక్తదానం చేసేందుకు బ్లడ్ బ్యాంక్‌కు చేరుకున్నారు. దీంతో అవసరమైన రెండు యూనిట్ల హ' నెగెటివ్ రక్తం సమకూరింది.అత్యవసర సమయంలో యూత్ రెడ్ క్రాస్ ఇచ్చిన పిలుపుకు తక్షణమే స్పందించి రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన ఇద్దరు దాతలను యూత్ రెడ్ క్రాస్ నాగర్ కర్నూల్ జిల్లా కన్వీనర్ దామగట్ల కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవాభావం, సమయస్ఫూర్తి అభినందనీయమని పేర్కొన్నారు.అత్యవసర సమయంలో స్పందించే ప్రతి రక్తదాత ఒక ప్రాణానికి అండగా నిలుస్తారని,రక్తదానం-మహాదానం అని, రక్త దానం వల్ల ఒకరి ప్రాణం నిలబెట్టినవారం అవుతామని అన్నారు.

పెరుగుతున్న విడాకుల సంస్కృతిపై కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు



దేశంలో విడాకులపై చర్చ పెరుగుతున్న వేళ నటి కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మారుతున్న సంబంధాలు, ప్రేమ, పెళ్లిపై నేటి తరం ఆలోచనా విధానంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్‌లో కనిపించే జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం వల్ల దంపతులపై అదనపు ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు.సోషల్ మీడియాలో ప్రేమ, పెళ్లి, ఆనందానికి సంబంధించిన ఎన్నో పోస్టులు కనిపిస్తుంటాయి. అయితే అవి ప్రతి ఒక్కరి నిజ జీవితాన్ని ప్రతిబింబించకపోవచ్చు. అందంగా కనిపించే ఫొటోలు, సంతోషకరమైన క్షణాలనే ఎక్కువగా పంచుకోవడంతో.. సంబంధాల్లో సమస్యలు, ఇబ్బందులు బయటకు కనిపించవు. దీంతో ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం మొదలవుతుందని కాజల్ పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై సోషల్ మీడియా నిఘా ఎక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి విషయంపైనా వచ్చే కామెంట్లు, విమర్శలు సంబంధాలపై ఒత్తిడిని పెంచుతున్నాయని తెలిపారు. ఈ ప్రభావం మహిళలపై మరింత ఎక్కువగా ఉంటుందని గతంలోనూ కాజల్ మాట్లాడారు.ప్రేమ సంబంధాల గురించి కాజల్ గతంలోనూ తన అభిప్రాయాలను వెల్లడించారు. జీవితంలో సంతోషం పూర్తిగా ప్రేమ లేదా వివాహ బంధంపైనే ఆధారపడకూడదని ఆమె చెప్పారు. భర్త గౌతమ్ కిచ్లుతో తన అనుబంధం గురించి కూడా పలు సందర్భాల్లో మాట్లాడారు.ప్రస్తుతం విడాకులపై ఆమె చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి. మారుతున్న అంచనాలు, సోషల్ మీడియా ప్రభావం, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ నేటి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయని కాజల్ వ్యాఖ్యలు

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్..
రిజర్వ్ ఓపెనర్ రేసులో సాయి సుదర్శన్



ఇంటర్నెట్ డెస్క్: గాయం బారిన పడిన భారత యువ బ్యాటర్ సాయి సుదర్శన్ కోలుకున్నాడు. ఆస్ట్రేలియా-ఎ, భారత్-ఎ మధ్య మంగళవారం నుంచి ప్రారంభం కానున్న నాలుగు రోజుల ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో అతడు ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్‌లో రాణించి న్యూజిలాండ్ పర్యటనకు భారత టెస్టు జట్టులో రిజర్వ్ ఓపెనర్ స్థానాన్ని దక్కించుకోవాలని భావిస్తున్నాడు.సాయ్ సుదర్శన్ ఇప్పటివరకు భారత్ తరఫున ఏడు టెస్టులు ఆడాడు. అయితే ఆ మ్యాచ్‌ల్లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఇటీవల శ్రీలంక పర్యటనలో భారత్- ఎ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన అతడు రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో వరుసగా 132, 168 పరుగులు చేశాడు. అయితే ఆ తర్వాత కాలికి ఫ్రాక్చర్ కావడంతో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సుమారు ఆరు వారాల పాటు పునరావాసం తీసుకుని తాజాగా పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు.

రిజర్వ్ ఓపెనర్ స్థానం కోసం..

భారత్ టెస్టు జట్టులో రిజర్వ్ ఓపెనర్ స్థానం కోసం సుదర్శన్‌తో పాటు అమన్ మొఖాడే కూడా పోటీ పడుతున్నాడు. మరోవైపు భారత్-ఎ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న దేవదత్ పడిక్కల్ శ్రీలంకలో జరిగిన గత సిరీస్‌లో రెండు సెంచరీలు సాధించి టెస్టు జట్టులో మూడో స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకున్నాడు. దీంతో సుదర్శన్ మరోసారి ఓపెనింగ్ స్థానంపై దృష్టి పెట్టాల్సి వచ్చింది. భారత టెస్టు జట్టులో వన్ డౌన్ బ్యాటర్, రిజర్వ్ స్పిన్నర్ స్థానాలపై సెలెక్టర్లు దృష్టి సారించారు. జనవరి చివరి వారం నుంచి మార్చి తొలి వారం వరకు జరగనున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నేపథ్యంలో ఈ స్థానాలకు ప్రాధాన్యం పెరిగింది.

రెండు లక్ష్యాలతో సిరీస్..

ఆస్ట్రేలియా-ఎ పర్యటనకు భారత్ రెండు ప్రధాన లక్ష్యాలతో సిద్ధమవుతోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఐదు టెస్టులు ఉండటంతో.. ఆటగాళ్లకు గాయాలు లేదా ఫిట్‌నెస్ సమస్యలు తలెత్తినప్పుడు వారి స్థానాలను భర్తీ చేయగల ఆటగాళ్లను గుర్తించడం ఒక లక్ష్యం. అదే సమయంలో న్యూజిలాండ్‌లో జరగనున్న మూడు టెస్టుల పర్యటనకు ఎంపిక చేసేందుకు ఆటగాళ్లను కూడా సెలెక్టర్లు పరిశీలించనున్నారు.

SPORTS

ఆసియా క్రీడలు: స్విమ్మింగ్‌లో స్వర్ణం..
13 ఏళ్లికే చైనా అథ్లెట్ రికార్డు



ఇంటర్నెట్ డెస్క్: ఆసియా క్రీడల్లో 13 ఏళ్ల వయసులోనే సంచలనం సృష్టించింది చైనాకు చెందిన యంగ్ అథ్లెట్. స్విమ్మింగ్‌లో యు జిడి అనే బాలిక స్వర్ణ పతకం సాధించి అందరి దృష్టినీ ఆకర్షించింది. మహిళల 200 మీటర్ల బటర్‌ఫ్లై ఫైనల్‌లో 2:05.08 టైమింగ్‌తో పసిడిని ముద్దాడి చరిత్ర సృష్టించింది. యు జిడి తన ప్రత్యర్థి చాంగ్ మొహాన్ కంటే మూడు సెకన్లకు ముందుగానే రేసును ముగించింది. ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు నెలకొల్పింది. ఈ క్రమంలో చైనాకే చెందిన స్టార్ స్విమ్మర్ జాంగ్ యుఫెయి రికార్డును బద్దలు కొట్టింది.ఇప్పటికే ప్రపంచ వేదికపై యు జిడి తన ముద్ర వేసింది. 2025 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో చైనా రిలే జట్టులో భాగంగా కాంస్య పతకం సాధించి.. స్విమ్మింగ్ చరిత్రలో ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకం గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. అయితే ఆసియా క్రీడల స్వర్ణం ఆమెకు మరింత ప్రత్యేకం. ఎందుకంటే ఇది ఆమె కెరీర్‌లో తొలి ప్రధాన వ్యక్తిగత టైటిల్. అది కూడా ఆసియా క్రీడల రికార్డుతో సాధించడం విశేషం.

ఒలింపిక్స్‌పై కన్ను..

ఈ విజయంతో సంతృప్తి చెందడం లేదని ఈ 13 ఏళ్ల స్విమ్మర్ చెబుతోంది. 'నేను ఇంకా వేగంగా ఈదాలని కోరుకుంటున్నా. ఈ పోటీల్లో నా టైమింగ్‌ను 0.9 సెకన్లు మెరుగుపరుచుకున్నా. మళ్లీసారి ఇంకా మెరుగ్గా రాణిస్తానని నమ్ముతున్నా. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించడమే నా లక్ష్యం. ప్రతిరోజూ కష్టపడి శిక్షణ తీసుకుంటున్నా. విజయం ఒక్కరోజులో రాదు' అని యు జిడి పేర్కొంది.

వలరివన్ వండర్

నగోయా: ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు తొలిరోజే పతకాల వేట ఆరంభించారు. ఆదివారం పోటీల్లో షూటింగ్‌లో ఎలవెనిల్ వలరివన్ అద్భుత ప్రదర్శనతో రెండు రజతాలు లభించాయి. మరోవైపు మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో సుచికా తరియాల్ సెమీస్ చేరి కనీసం కాంస్యం ఖాయం చేసుకోగా.. మహిళల క్రికెట్ సెమ?సలో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసి భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. తద్వారా హర్మన్‌ప్రీత్ సేన స్వర్ణంపై కన్నేసింది. ఇక మహిళల, పురుషుల హాకీ జట్లు తమ ఆరంభ మ్యాచ్‌ల్లో ఘనంగా బోణీ చేయగా.. బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్స్‌లోనూ శుభారంభం దక్కింది. అయితే ఉషు, టెక్‌బాల్ ఈవెంట్లలో మాత్రం నిరాశే ఎదురైంది.ఎలవెనిల్ అదుర్స్: మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో తమిళనాడుకు చెందిన 27 ఏళ్ల షూటర్ ఎలవెనిల్ వలరివన్ సత్తా చాటింది. చివరి నిమిషం వరకు ఉత్కంఠగా సాగిన వ్యక్తిగత విభాగంలో ఆమె తృటిలో స్వర్ణం చేజార్చుకుంది. ఆరంభం నుంచే కచ్చితమైన షాట్లతో చైనా, కొరియన్ షూటర్లను వణికించింది. ఇలా 21 షాట్ల వరకు కూడా ఎలవెనిల్ టాప్‌లో నిలిచినా, ఆఖర్లో జపాన్ షూటర్ హినాటా తైచీ ముందుకెళ్లింది. చివరకు తైచీ ఓవరాల్‌గా 253 పాయింట్లతో ఆసియా గేమ్స్ రికార్డు నెలకొల్పి స్వర్ణం దక్కించుకుంది. ఇక, తైచీకన్నా 0.6 పాయింట్లు మాత్రమే వెనుకంజలో నిలిచిన ఎలవెనిల్ మొత్తంగా 252.4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజతానికి పరిమితమైంది. దక్షిణ కొరియా షూటర్ బాన్ హ్యోజీన్ ((230.4)కు కాంస్యం లభించింది. అంతకుముందు జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత్ రజతం నెగ్గడంలోనూ ఎలవెనిల్ కీలకపాత్ర పోషించింది. టీమ్ ఈవెంట్ ఫైనల్స్‌లో ఎలవెనిల్ వలరివన్, సోనమ్ మస్కర్, విదర్సా వినోద్‌లతో కూడిన భారత త్రయం 1898.0 పాయింట్లతో ద్వితీయ స్థానం దక్కించుకొని భారత్ ఖాతాలో తొలి పతకాన్ని చేర్చింది. చైనా బృందం (1904.2) స్వర్ణం, ఆతిథ్య జపాన్ (1897.1) కాంస్యం చేజిక్కించుకున్నాయి. ఇక ఒకే టోర్నీలో రెండు పతకాలతో భారత అమ్మాయి ఎలవెనిల్ డబుల్ ధమాకా సృష్టించింది. హాకీలో బోణీ: భారత పురుషుల, మహిళల హాకీ జట్లు ఆరంభ మ్యాచ్‌లోనే అదరగొట్టాయి. మహిళల విభాగంలో ఉబ్బెకిస్థాన్‌తో ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో భారత్ 19-0తో గెలిచింది. దీపిక ఏకంగా 8 గోల్స్‌తో చెలరేగడం విశేషం. భారత పురుషుల జట్టు ఇండోనేసియాను 13-1తో మట్టి కరిపించింది. స్ట్రయికర్ దిల్‌ప్రీత్ సింగ్ 4 గోల్స్‌తో ఆకట్టుకున్నాడు.

